# ప్రజా మార్పుల

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల  సంపుటి : 05  సంచిక : 182  పేజీలు : 04  వెల రూ. 2  ఆదివారం  04 - 01 - 2026




రూ.35 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

## కాళేశ్వరం పై అధిక మోజు
# పాలమూరు పై నిర్లక్ష్యం

- తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- కృష్ణా జలాల్లో రాష్ట్రానికి అన్యాయం చేసింది బీఆర్ఎస్ పెద్దలే
- పాలమూరు ప్రాజెక్టును కావాలనే నిర్లక్ష్యం చేశారన్న ఉత్తమ్
- ప్రాజెక్టుపై అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చిన మంత్రి ఉత్తమ్ కుమార్
- కాళేశ్వరంపై రూ.90వేల కోట్లు ఖర్చు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరుకు రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఉత్తమ్ కుమార్ రెడ్డి
- "కృష్ణానదీ జలాల నీటి కేటాయింపుల విషయంలో గత ప్రభుత్వాల కంటే చాలా సమర్థవంతంగా నీటి హక్కులను కాపాడాం



పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై గత ప్రభుత్వ హయాంలో కేవలం 30 శాతం నిధులు మాత్రమే ఖర్చు పెట్టారని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శాసనసభలో సాగునీటి ప్రాజెక్టులపై జరిగిన చర్చలో ఉత్తమ్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) ప్రభుత్వం 2015లో జీవో ఇచ్చి 2022లో డీపీఆర్(సమగ్ర ప్రాజెక్టు నివేదిక) సమర్పించిందని ఆయన వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు అనుమతుల కోసం పెట్టిన శ్రద్ధ పాలమూరు ప్రాజెక్టుపై పెట్టలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టు వాటర్ సోర్సును మార్చడం వల్ల తీవ్ర - మిగతా 2 లో

## ఉపాధి హామీ పథకంలో మార్పులు
# గ్రామీణ పేదల జీవితాలు మళ్లీ అస్తవ్యస్తం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఎంజీ నరేగాను కొనసాగించాలంటూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం
- నరేగాను యథాతథంగా కొనసాగించాలన్న సీఎం రేవంత్ రెడ్డి
- సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టిన మంత్రి సీతక్క
- కొత్త చట్టానికి తెలంగాణ వ్యతిరేకమని తెలియజేయాలనే ఈ తీర్మానం చేశామన్న సీఎం రేవంత్ రెడ్డి



ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులు గ్రామీణ పేదల జీవితాలను మళ్లీ అస్తవ్యస్తం చేసే ప్రమాదం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మార్పుల వల్ల గ్రామాల్లో పని దొరకక పేదలు మళ్లీ పట్టణాలకు వలస బాట - మిగతా 2 లో

## కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్

శాసనసభలో సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ప్రజెంటేషన్ జరుగుతున్న సమయంలో సభలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సరైన సంఖ్యలో లేకపోవడంపై రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం


శాసనసభ కార్యకలాపాల పట్ల సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్న సీఎం రేవంత్ రెడ్డి



2 లో

## వెనెజువెలాపై
# అమెరికా మిలిటరీ యాక్షన్?

- ట్రంప్ ఆదేశాలతోనే దాడులన్న మీడియా
- వెనెజువెలా రాజధాని కారకాస్‌లో భారీ పేలుళ్లు
- ఇది అమెరికా సైనిక దాడేనని ఆరోపించిన మదురో ప్రభుత్వం
- దేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి విధింపు
- ట్రంప్ ఆదేశాలతోనే దాడులని పేర్కొన్న అమెరికా మీడియా
- వెనెజువెలా గగనతలంలో విమానాలపై అమెరికా నిషేధం



వెనెజువెలాలో శనివారం తెల్లవారుజామున తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాజధాని కారకాస్‌తో పాటు పలు నగరాల్లో భారీ పేలుళ్లు సంభవించాయి. ఇది అమెరికా జరిపిన సైనిక దాడేనని వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో ప్రభుత్వం తీవ్రంగా ఆరోపించింది. దేశవ్యాప్తంగా జాతీయ అత్యవసర పరిస్థితి (నేషనల్ ఎమర్జెన్సీ) విధిస్తున్నట్లు ప్రకటించింది.స్థానిక కాలమానం ప్రకారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో కారకాస్‌లో కనీసం ఏడు భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. యుద్ధ విమానాలు తక్కువ ఎత్తులో ప్రయాణించినట్లు స్థానికులు తెలిపారు. కారకాస్‌లోని లా కార్లోటా సైనిక - మిగతా 2 లో

## బళ్లారి ఘటన...
# సస్పెండైన ఎస్పీ అత్మహత్యాయత్నం



- బళ్లారిలో కాల్పుల ఘటన
- సకాలంలో ఘటన స్థలికి వెళ్లలేదంటూ బళ్లారి ఎస్పీపై వేటు
- సస్పెన్షన్‌తో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసిన ఎస్పీ
- బాధ్యతలు స్వీకరించిన రెండు గంటల్లోనే ఆయనపై వేటు వేసిన ప్రభుత్వం
- ఇది 'హంతక ప్రభుత్వం' అంటూ కాంగ్రెస్‌పై బీజేపీ తీవ్ర విమర్శలు
- ఎస్పీని బలిపశువును చేశారని ఆరోపించిన ప్రతిపక్ష నేత అశోక

కర్ణాటకలో సంచలనం సృష్టించిన బళ్లారి కాల్పుల ఘటనలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ సస్పెన్షన్‌కు గురైన జిల్లా ఎస్పీ పవన్ నెజ్జూర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తనను సస్పెండ్ చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన, తుమకూరు జిల్లాలోని తన స్నేహితుడి ఫామ్‌హౌస్‌లో నిద్రమాత్రలు మింగినట్లు సమాచారం. - మిగతా 2 లో


## కొనసాగుతున్న
# మరో ఎన్‌కౌంటర్



2 లో

- 12 మంది మావోయిస్టుల మృతి
- ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి మావోయిస్టులపై విరుచుకుపడ్డ భద్రతా బలగాలు
- దక్షిణ బస్తర్ జిల్లా అడవుల్లో కాల్పుల మోత
- ఉదయం 5.30 గంటలకు ప్రారంభమైన కాల్పులు
- కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్
- ఘటనా స్థలిలో 3 ఏకే-47 రైఫిళ్లతో పాటు, పలు ఆయుధాలు కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం

## ప్రజానాడి




## పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే
# అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇది ఘనమైన ఆరంభం
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే ఏపీకి అగ్రస్థానం
- బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదికలో వెల్లడైన గణాంకాలు
- దేశంలోని మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకి
- 2026 ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల కాలానికి (ఏప్రిల్-డిసెంబర్ 2025) దేశవ్యాప్తంగా వచ్చిన మొత్తం పెట్టుబడి ప్రతిపాదనల్లో ఏపీ ఏకంగా 25.3 శాతం వాటాను దక్కించుకుంది
- ప్రభుత్వ ముందుచూపుతో కూడిన విధాన సంస్కరణల వల్లే ఇది సాధ్యమైందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు



పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. 2026 ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల కాలానికి (ఏప్రిల్-డిసెంబర్ 2025) దేశవ్యాప్తంగా వచ్చిన మొత్తం పెట్టుబడి ప్రతిపాదనల్లో ఏపీ ఏకంగా 25.3 శాతం వాటాను దక్కించుకుంది. ఈ విషయాన్ని బ్యాంక్ ఆఫ్ బరోడా తన తాజా ఆర్థిక నివేదికలో వెల్లడించింది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ డేటా ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. ఈ మేరకు ఫోర్బ్స్ బిజినెస్ మేగజైన్ ఓ కథనం వెలువరించింది.దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర ప్రజలకు శుభవార్త అని, కొత్త సంవత్సరానికి బలమైన ఆరంభమని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వ ముందుచూపుతో కూడిన విధాన సంస్కరణల వల్లే ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు. "ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభవార్త, కొత్త సంవత్సరానికి ఘనమైన ఆరంభం. మా ముందుచూపుతో కూడిన విధాన సంస్కరణల ప్రభావాన్ని, - మిగతా 2 లో

## కొండగట్టు అంజన్నే
# నా ప్రాణాలు కాపాడారు




- ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్న పవన్ కల్యాణ్
- కొండగట్టులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేక పూజలు
- విద్యుత్ ప్రమాదం నుంచి తనను కొండగట్టు అంజన్నే కాపాడారన్న పవన్
- ధర్మశాల, దీక్ష విరమణ మండపానికి భూమి పూజ
- దైవ కార్యానికి మంచి మనసుతో చంద్రబాబు ఆమోదం తెలిపారని వెల్లడి
- అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామంటే దేవుడి దయ ఉండాలి
- దీక్ష విరమణ మండపం, 96 గదుల సత్రం నిర్మాణం
- అభివృద్ధి పనుల కోసం రూ.35.19 కోట్ల టీటీడీ నిధులు మంజూరు

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్, తనకు కొండగట్టు ఆంజనేయ స్వామిపై ఉన్న అచంచల భక్తిని మరోసారి చాటుకున్నారు. తెలంగాణలోని జగిత్యాల జిల్లాలో ఉన్న ఈ ప్రముఖ పుణ్యక్షేత్రాన్ని శనివారం సందర్శించిన ఆయన, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో జరిగిన ఓ పెను ప్రమాదం నుంచి తనను కొండగట్టు అంజన్నే కాపాడారని, ఇది తనకు పునర్జన్మ లాంటిదని - మిగతా 2 లో

# సంపాదకీయం

## ట్రంప్ అడుగుజాడల్లో చైనా



మంచేదైనా జరిగితే తమ ఖాతాలో వేసుకోవటానికి సిద్ధపడేవాళ్లు కోకొల్లలు. ఇది లోకో త్తర సత్యం. ఒకరకంగా అదొక వ్యాధి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఆ సమస్య ఉంది. తన ప్రమేయం లేకుండా ముగిసిన యుద్ధాలనూ, ఇంకా ముగియని యుద్ధాలనూ తానే ఆపానని చెప్పుకోవడంతోపాటు ఉనికిలో లేనివాటికి కూడా అడ్డుచక్రం వేశాననటం ఆయనకే చెల్లింది. ఆ బాణీ ఇంకా ఆపలేదు. ఇప్పుడు చైనా వంతు వచ్చినట్టుంది. 2025లో భారత్‌పాక్ ఘర్షణలు నివారించటంతోపాటు అనేక ఇతర యుద్ధాలను ఆపిన ఘనత తమదంటూ తాజాగా వాంగ్‌యీ ప్రకటించుకున్నారు. ఆ రెండు దేశాలూ అనేక రంగాల్లో పోటీపడుతున్నాయి. ఆర్థికంగా ఇప్పటికీ అమెరికాదే పైచేయి అయినా, రేపో మాపో దాన్ని చైనా అధిగమిస్తుందని ఎవరో కాదు... ఆర్థిక నిపుణులే దండోరా వేస్తు న్నారు. ఆ విషయంలో చైనాను ప్రశంసించాల్సిందే! అమెరికాతో పోలిస్తే ఎక్కడో అట్ట డుగునుండే దేశాన్ని 75 ఏళ్లలోనే ఈ స్థాయికి తీసుకురావటం మాటలు కాదు మరి. అంతమాత్రాన అమెరికా చెప్పే అబద్ధాలను కూడా వల్లెవేయటం వంటి చౌకబారు అనుకరణలు బెడిసికొడతాయని చైనా గ్రహించకపోవటం క్షమార్హం కానిది. కశ్మీర్‌లోని పెహల్గాంలో పాక్ నుంచి చొరబడిన ఉగ్రవాదులు అనేకమంది అమాయ కులను పొట్టనబెట్టుకున్న వైనం తర్వాత గత ఏడాది మే మొదటివారంలో మన దేశం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో అక్కడి ఉగ్ర స్థావరాలపై దాడులు చేయటం, దానికి ప్రతిగా పాకిస్తాన్ సైన్యం మనపై దాడి చేసే ప్రయత్నం, మనం తిప్పికొట్టడం, ఎదురు దాడి చేయడం వంటివి జరిగాయి. చివరకు కుదిరిన కాల్పుల విరమణ వెనక రెండు దేశాల మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్లు (డీజీఎంలు) ఉన్నారని మన దేశం చెబుతోంది. ఇలాంటి విషయాల్లో మూడో పక్షం జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించ బోమని అప్పట్లోనే స్పష్టం చేసింది. నిజానికి 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా పాక్ సైన్యం వాడిన ఆయుధ సామగ్రిలో చైనా సరఫరా చేసినవి కూడా ఉన్నాయని అప్పుడే బయటపడింది. ఆ సామగ్రి 81 శాతం అని కూడా తేలింది. పాకిస్తాన్ మనపై ప్రయోగించిన ఆయుధ సామగ్రి చూశాక, ఈ ఘర్షణను 'సజీవ ప్రయోగశాల'గా చైనా ఉపయోగించుకున్నట్టు కనబడుతోందని కూడా మన దేశం విమర్శించింది. అలాంటి దేశం 'తగుదు నమ్మా...' అంటూ ఇరుపక్షాల మధ్యా రాజీకీ దౌత్యం నెరపానని ఇప్పుడు గప్పాలు కొడుతోంది. లోపాయకారీగా ఘర్షణలను ఎగదోయటం, పైకి శాంతి వచనాలు వల్లించటం ఇటీవలి ధోరణేం కాదు. ఇలాంటి జిత్తులమారి ఎత్తుగడల్లో అమెరికా ఆరితేరింది. ఇజ్రా యెల్ సాగించే అన్ని దాడుల వెనకా ఆ దేశం ఉంటుంది. అవే దాడుల్ని ఆపినట్టు కనబడటంలో ముందుంటుంది. శాంతి సాధన కోసం 'ఏ సమస్యనైనా వస్తునిష్ఠతో చూడటం, న్యాయమైన వైఖరి తీసుకోవటం' తమ విధానమని... లక్షణాలనూ, మూల కారణాలనూ తొలగించటమే తమ ధ్యేయమని వాంగ్‌యీ చెప్పుకున్నారు. డాలర్ ఇంకా శాసిస్తూనే ఉంది కనుక అమెరికా ఇలాంటి అబద్ధాలు చెప్పినా ఏదోమేరకు చెల్లు బాటవుతాయి. సుంకాలు పెంచుతామని బెదిరించానంటే 'అవును కాబోలు...' అని ఎవరికైనా అనిపించవచ్చు. కానీ చైనా సైతం 'అన్నీ నేనే... అంతా నేనే' అని అనటం ఎబ్బెట్టుగా ఉంటుంది. అదను చూసుకుని పక్కనున్న తైవాన్‌ను కబళించాలని ప్రయత్నిస్తూ, మనతో సరిహద్దుల్లో అకారణ వైరానికి దిగుతూ, అరుణాచల్ ప్రదేశ్‌లో గ్రామాల పేర్లు మార్చు కుని మురిసిపోతూ ఇలా తటస్థత నటించటం అనైతికత. చైనాకూ, తైవాన్‌కూ మధ్య రాజీ కుదర్చటానికి ప్రయత్నిస్తానని మన దేశం ముందుకొస్తే చైనా అంగీకరిస్తుందా? అధికారంలోకొచ్చిన నాటి నుంచీ నోబెల్ బహుమతి కోసం వెంపర్లాడటం ట్రంప్‌కు ఎక్కువైంది. బహుశా ఆయనకు మోకాలడ్డాలని చైనా ఏమైనా ప్రయత్నిస్తోందేమో! అలా చేయదల్చుకుంటే ట్రంప్ తప్ప వేరెవరూ చైనాను ఆటంకపరచరు. తామిచ్చే శాంతి బహుమతి సైతం ప్రతిష్ఠాత్మకమైనదిగా ఉండేలా చూసుకొనే బాధ్యత నోబెల్ కమిటీది. ఈలోగా లేని పెద్దరికాన్ని ప్రదర్శించటం వల్ల నవ్వులపాలు కావటం ఖాయమని అటు ట్రంప్, ఇటు చైనా తెలుసుకోవాలి.

# కొండగట్టు అంజన్నే నా ప్రాణాలు కాపాడారు

**మొదటిపేజీ తరువాయి** - భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో, ఈ ప్రాంతంలోనే తాను హై-టెన్షన్ విద్యుత్ తీగల ప్రమాదం నుంచి అద్భుతంగా బయటపడ్డానని పవన్ కల్యాణ్ గుర్తుచేసుకున్నారు. ఆ స్వామి ఆశీస్సులతోనే తాను ప్రాణాలతో ఉన్నానని, అందుకే "కొండగట్టు నాకు పునర్జన్మనిచ్చింది" అని బలంగా నమ్ముతానని తెలిపారు. అడుగడుగునా ధైర్యాన్ని, బలాన్ని ఇచ్చి నడిపిస్తున్నది కూడా ఆ అంజన్న స్వామేనని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిధులతో చేపట్టనున్న రూ.35.19 కోట్ల అభివృద్ధి పనులకు పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో 96 గదులతో



కూడిన విశాలమైన సత్రం, దీక్షా విరమణ కోసం ఒకేసారి 2,000 మంది భక్తులు కూర్చునేలా ఆధునిక మండపం నిర్మించనున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టీటీడీ ఛైర్మన్ సహకారంతో ఈ పనులు సాధ్యమయ్యాయని ఆయన వివరించారు. ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి పర్యవేక్షణలో, ఆలయ ప్రాశస్త్యం దెబ్బతినకుండా ఆగమశాస్త్ర నియమాల ప్రకారం ఈ నిర్మాణాలను చేపట్టనున్నారు. గతంలో తన ప్రచార వాహనం 'వారాహి'కి కూడా పవన్ కల్యాణ్ ఇక్కడే ప్రత్యేక పూజలు చేయించిన విషయం తెలిసిందే. ఏపీ ప్రభుత్వ సహకారంతో తెలంగాణలోని ఆలయాన్ని అభివృద్ధి చేయడం, రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఆధ్యాత్మిక వారధిని నిర్మించడం లాంటిదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆలయ సందర్శన అనంతరం పవన్, తెలంగాణ జనసేన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు.

# దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్ర సృష్టించిన సావిత్రిబాయి పూలే

**మొదటిపేజీ తరువాయి** - దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్ర సృష్టించిన సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా ఘన నివాళి అర్పించారు. మహిళలను విద్యావంతులుగా చేయాలనే లక్ష్యంతో ఆనాడు సమాజ కట్టుబాట్లను ధిక్కరించి ఆమె చేసిన సాహసం నేటి ఆధునిక మహిళా శక్తికి బలమైన పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే చేసిన పోరాటం మహిళల విద్యకే పరిమితం కాకుండా, పురుషులకన్నా మిన్నగా అవకాశాలను సద్వినియోగం చేసుకునే స్థాయికి మహిళలను తీసుకొచ్చిందని చంద్రబాబు తెలిపారు. ఆమె చూపిన దారిలోనే నేటి మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తున్నారని అభిప్రాయపడ్డారు. సమాజంలో సగభాగమైన మహిళల విద్యాభివృద్ధి లో సావిత్రిబాయి పూలే కీలక పాత్ర పోషించారని సీఎం గుర్తు చేశారు. అందుకే ఆధునిక మహిళలు ఆమెకు సదా కృతజ్ఞతలు తెలపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళా విద్యకు వెలుగులు నింపిన సావిత్రిబాయి పూలేకు మరోసారి ఘన నివాళులు అర్పిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ట్వీట్‌లో తెలిపారు.

**దేశ మొట్టమొదటి మహిళా టీచర్ సావిత్రిబాయి పూలే .. లోకేశ్**

సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నానని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే మన దేశ మొట్టమొదటి మహిళా టీచర్ అని, స్త్రీ విద్య, హక్కుల సాధన కోసం జీవితాంతం కృషిచేశారని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిని సమాజ మార్పునకు శక్తిమంతమైన సాధనంగా భావించారన్నారు. సామాజిక వ్యతిరేకత, అవమానాలు ఎదురైనా బాలికల విద్య కోసం ధైర్యంగా ముందుకు సాగారని, నేటి మహిళా ఉపాధ్యాయులకు ఆమె మార్గదర్శి అనీ



అన్నారు. సావిత్రిబాయి పూలే ఆశయ సాధన కోసం కృషి చేయడమే ఆమెకు మనం అర్పించే నిజమైన నివాళి అని లోకేశ్ పేర్కొన్నారు.

# వెనెజువెలాపై అమెరికా మిలిటరీ యాక్షన్?

**మొదటిపేజీ తరువాయి** - వైమానిక స్థావరం, ఫ్యూర్టే టియునా మిలిటరీ బేస్‌తో పాటు మిరాండా, లా గౌయిరా, అరాగువా రాష్ట్రాల్లోని సైనిక, పౌర లక్ష్యాలపై దాడులు జరిగాయని వెనెజువెలా ప్రభుత్వం పేర్కొంది. "మా దేశంలోని చమురు, ఖనిజ వనరులను స్వాధీనం చేసుకోవాలనే దురుద్దేశంతోనే అమెరికా ఈ దురాక్రమణకు పాల్పడింది. మా రాజకీయ స్వాతంత్ర్యాన్ని బలవంతంగా దెబ్బతీయాలని చూస్తున్నారు, కానీ అది ఎప్పటికీ జరగదు," అని మదురో ప్రభుత్వం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. ఈ దాడులపై అమెరికా ప్రభుత్వం నుంచి (వైట్‌హౌస్, పెంటగాన్) ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయితే, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకే వెనెజువెలాలోని కొన్ని ప్రాంతాలపై దాడులు జరుగుతున్నాయని పేరు చెప్పడానికి ఇష్టపడని అమెరికా



అధికారులు కొన్ని మీడియా సంస్థలకు తెలిపినట్లు అంతర్జాతీయ వార్తా కథనాలు వెలువడు తున్నాయి. మరోవైపు, "కొనసాగుతున్న సైనిక కార్యకలాపాల" కారణంగా వెనెజువెలా గగనతలంలో తమ వాణిజ్య విమానాల రాకపోకలను అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ నిషేధించింది. ఈ ఘటనపై పొరుగు దేశమైన కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో స్పందించారు. కారకాస్‌పై మిస్సైళ్లతో బాంబు దాడులు జరుగుతున్నాయని, ఐక్యరాజ్యసమితి వెంటనే అత్యవస రంగా సమావేశం కావాలని ఆయన సోషల్ మీడియా వేదికగా పిలుపునిచ్చారు. డ్రగ్స్ అక్రమ రవాణాకు మదురో ప్రభుత్వం సహకరిస్తోందని ఆరోపిస్తూ అమెరికా గత కొన్ని నెలలుగా తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్న నేపథ్యంలో ఈ దాడులు జరగడం గమనార్హం. ప్రస్తుతం వెనెజువెలాలో యుద్ధ వాతావరణం నెలకొంది. దాడుల్లో జరిగిన నష్టం, మృతుల వివరాలపై ఇంకా స్పష్టత రాలేదు.

# బళ్లారి ఘటన... సస్పెండైన ఎస్పీ ఆత్మహత్యాయత్నం

**మొదటిపేజీ తరువాయి** - ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని పోలీసు వర్గాలు వెల్లడించాయి. జనవరి 1న బళ్లారిలో జరిగిన హింసాత్మక ఘటనకు కేవలం రెండు గంటల ముందే పవన్ నెజ్జూర్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించడం గమనార్హం. 11 ఏళ్ల సర్వీసులో ఆయనకు ఇదే తొలి ఎగ్జిక్యూటివ్ పోస్టింగ్. ఈ ఘటనలో ఓ కాంగ్రెస్ కార్యకర్త మరణించడంతో, ప్రభుత్వం ఆయనపై నిర్లక్ష్యం ఆరోపణలతో వేటు వేసింది. ఈ పరిణామంపై ప్రతిపక్ష బీజేపీ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ సర్కార్ ఒక 'హంతక ప్రభుత్వం'గా మారిందని ప్రతిపక్ష నేత ఆర్. అశోక ధ్వజమెత్తారు. "రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. ఈ ఘటనలో ఎస్పీని బలిపశువును చేశారు. బళ్లారిలో ఎమ్మెల్యే జనార్దన్ రెడ్డిని హత్య చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలే ప్రయత్నించి, తమ సొంత కార్యకర్తనే కాల్చి చంపుకున్నారు. అధికారులపై ఒత్తిడి పెంచి వారి ఆత్మహత్యలకు ఈ ప్రభుత్వం కారణమవుతోంది. ఇది 'ఆత్మహత్య గ్యారెంటీ' ఇచ్చే ప్రభుత్వం" అని అశోక తీవ్ర విమర్శలు చేశారు. అయితే, ఎస్పీ సస్పెన్షన్‌ను కర్ణాటక ప్రభుత్వం సమర్థించుకుంది. ఘటనా స్థలానికి వెంటనే వెళ్లడంలో ఎస్పీ విఫలమయ్యారని, అందుకే ఆయనపై చర్యలు తీసుకున్నామని న్యాయశాఖ మంత్రి హెచ్.కె. పాటిల్ తెలిపారు. "బాధ్యతలు స్వీకరించిన 30 నిమిషాలైనా సరే, ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు అధికారి వెంటనే స్పందించాల్సి ఉంటుంది" అని ఆయన స్పష్టం చేశారు.



# కాళేశ్వరం ప్రాజెక్టుపై అధిక మోజు చూపి, పాలమూరును నిర్లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి** - నష్టం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరంపై రూ.90వేల కోట్లు ఖర్చు చేసినవారు(బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో) పాలమూరుకు రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పాలమూరు ప్రాజెక్టులో ఒక మోటార్ ఆన్ చేసి జాతికి అంకితం చేశామని ప్రకటించారన్నారు. కేసీఆర్ మోటార్ ఆన్ చేసిన తెల్లారే మళ్లీ ఆఫ్ చేశారని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు. కృష్ణా నది ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. గత ప్రభుత్వం రూ. 40 వేల కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టిందని, కాళేశ్వరం ప్రాజెక్టుపై అధిక మోజు చూపి పాలమూరును నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి రోజుకు 3 టీఎంసీలు తరలించేలా అంచనాలు పెంచుకుంటూ పోయారని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పాలమూరులో మాత్రం 1.5 నుంచి ఒక టీఎంసీకి తగ్గించారన్నారు. జూరాల నుంచి అయితే రోజుకు 2.8 టీఎంసీలు తరలించే అవకాశం ఉండేదని వివరించారు. 60 రోజుల్లో 121 టీఎంసీలు తీసుకునేవాళ్లమని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. వాటర్ సోర్స్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం వల్ల 68 టీఎంసీల స్థాయికి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయకట్టు కాల్వల ప్రస్తావన, భూసేకరణ లేకుండానే డీపీఆర్‌ను రూపొందించారని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. ప్రాణహిత - చేవెళ్లను తుమ్మిడిహట్టి నుంచి మార్చి గోదావరిలో అన్యాయం చేశారన్నారు.



జూరాల నుంచి అయితే 22 పంపుల ఏర్పాటుతో ప్రాజెక్టు పూర్తయ్యేదన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి 414 మీటర్ల లోతు నుంచి నీరు తీసుకొనేవాళ్లమన్నారు. శ్రీశైలానికి మార్చడం వల్ల పంపుల సంఖ్య 37కి పెరిగిందని తెలిపారు. దాదాపు 560 మీటర్ల లోతు నుంచి నీటిని ఎత్తిపోయా ల్సిన పరిస్థితి వచ్చిందని వివరించారు. "కృష్ణానదీ జలాల నీటి కేటాయింపుల విషయంలో గత ప్రభుత్వాల కంటే చాలా సమర్థవంతగా నీటి హక్కులను కాపాడాం. 2014 -2023 వరకు అధికారంలో ఉన్నవాళ్లు కృష్ణానదీ జలాలపై తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారు. తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయి, మిగిలిన నీటిని ఆంధ్రప్రదేశ్‌కు 512 ఇవ్వాలని లిఖిత పూర్వకంగా ఇచ్చిన ఘనత వారికే దక్కింది. మా ప్రభుత్వంలో రాబోవు మూడేళ్లలో కల్వకుర్తి, కృష్ణా బేసిన్‌లో అన్ని ప్రాజెక్టులు మూడేళ్లలో పూర్తిచేస్తాం. కాళేశ్వరం ప్రాజెక్టుకు 90వేల కోట్లు ఖర్చుపెట్టి, పాలమూరుకు మాత్రం 20వేల కోట్లే ఖర్చుచేశారు". తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాయలసీమ ఎత్తిపోతలపై కేంద్రప్రభుత్వానికి ఫిర్యాదు చేశామని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. పనులను నిలిపివేయించామన్నారు. 2024-25 సీజన్‌లో కృష్ణా జలాల్లో అధిక నీటిని వాడుకున్నామని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటిపారుదల(ఇరిగేషన్) ప్రాజెక్టులకు రూ.1.80 లక్షల కోట్లు వ్యయం చేశారన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలకు అంగీకరించి కేసీఆర్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. కృష్ణా నదీ పరివాహకం ప్రకారం మనకు అధిక వాటా రావాల్సి ఉందన్న ఆయన తమ ప్రభుత్వం వచ్చాక 550 టీఎంసీలు నీరు కావాలని వాదించామన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు కింద ఇంకా 39 వేల ఎకరాల భూ సేకరణ ప్రక్రియ పెండింగ్‌లో ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సర్కారు శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి అక్రమంగా నీరు తరలిస్తుంటే బీఆర్ఎస్ ప్రభుత్వం చూస్తూ కూర్చుందని ఉత్తమ్ కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఏపీ ప్రభుత్వం రోజుకు 13 టీఎంసీలు తరలించుకుపోయేలా ప్రాజెక్టును విస్తరించిందని ఆరోపించారు. జగన్ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతలు ప్రాజెక్టు నిర్మిస్తుంటే బీఆర్ఎస్ కనీసం అభ్యంతరం చెప్పలేదని మండిపడ్డారు.

# పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్



**మొదటిపేజీ తరువాయి** - ప్రత్యేకించి, సకాలంలో మరియు పారదర్శకంగా ప్రోత్సాహకాల పంపిణీ కోసం ఎస్క్రో-ఆధారిత యంత్రాంగాన్ని ప్రవేశపెట్టడం, అలాగే స్పష్టమైన, రంగాల వారీ విధానాలను ప్రవేశపెట్టడం వంటి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' కార్యక్రమాల ప్రభావాన్ని ఇది ప్రతిబింబిస్తుంది" అని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంపై నమ్మకముంచి పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చిన ఇన్వెస్టర్లకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక ప్రకారం, ఈ తొమ్మిది నెలల్లో దేశవ్యాప్తంగా మొత్తం రూ.26.6 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ తర్వాత ఒడిశా (13.1 శాతం), మహారాష్ట్ర (12.8 శాతం) రాష్ట్రాలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఈ మూడు రాష్ట్రాలు కలిపి దేశంలోని మొత్తం పెట్టుబడి ప్రతిపాదనల్లో 51.2 శాతం వాటాను ఆకర్షించడం గమనార్హం.

# కొనసాగుతున్న మరో ఎన్ కౌంటర్



**మొదటిపేజీ తరువాయి** - ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి మావోయిస్టులపై భద్రతా బలగాలు విరుచుకుపడుతున్నాయి. బీజాపూర్ జిల్లా దక్షిణ అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురు కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు హతమయ్యారు. భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య తీవ్రస్థాయిలో కాల్పులు చోటుచేసు కున్నాయి. దక్షిణ బస్తర్ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఉందన్న సమాచారం అందడంతో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) బృందాలు గాలింపు చర్యలు ప్రారంభించాయి. ఈ క్రమంలో ఉదయం సుమారు 5.30 గంటల సమయంలో అటవీ ప్రాంతంలో దాగి ఉన్న మావోయిస్టులు ఒక్కసారిగా కాల్పులకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. భద్రతా బలగాలు కూడా వెంటనే ప్రతిస్పందించడంతో రెండు వైపులా ఎదురుకాల్పులు జరిగాయి. కాల్పులు ముగిసిన తర్వాత ఆ ప్రాంతాన్ని పూర్తిగా జల్లెడ పట్టిన భద్రతా బలగాలకు 12 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఘటనా స్థలిలో 3 ఏకే-47 రైఫిళ్లతో పాటు, పలు ఆయుధాలు కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే, ఆ ప్రాంతంలో ఇంకా మావోయిస్టులు ఉండే అవకాశముందని భావిస్తున్న భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నాయి. జవాన్ల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఎన్‌కౌంటర్ జరిగిన కచ్చితమైన ప్రదేశాన్ని అధికారులు ప్రస్తుతం బయటకు వెల్లడించలేదు. పూర్తి వివరాలు గాలింపు చర్యలు ముగిసిన తర్వాత వెల్లడించే అవకాశం ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి.

# కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్



**మొదటిపేజీ తరువాయి** - తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మూడో రోజుకు చేరుకున్నాయి. సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం శాసనసభలో సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ ప్రజెంటేషన్ జరుగుతున్న సమయంలో సభలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సరైన సంఖ్యలో లేకపోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

**ఎమ్మెల్యేలకు ఫోన్ కాల్స్..**

ప్రజెంటేషన్ సమయంలో కొందరు ఎమ్మెల్యేలు సభలో లేకుండా లాబీల్లో తిరగడాన్ని సీఎం తీవ్రంగా తప్పుపట్టారు. ఇది మంచి పద్ధతి కాదని వ్యాఖ్యానించిన సీఎం, వెంటనే అందరినీ సభలోకి పిలిపించాలని విప్‌లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సీఎం సలహాదారులు ఎమ్మెల్యేలకు ఫోన్ కాల్స్ చేసి సభలోకి రావాలని సూచించారు. ఆ తరువాత ఒక్కొక్కరుగా ఎమ్మెల్యేలు హాల్‌లోకి చేరుకున్నారు. శాసనసభ కార్యకలాపాల పట్ల సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా సూచించినట్లు సమాచారం.

# ఉపాధి హామీ పథకంలో మార్పులు గ్రామీణ పేదల జీవితాలు మళ్లీ అస్తవ్యస్తం



**మొదటిపేజీ తరువాయి** - పట్టాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించాలన్న సదుద్దేశంతో ఆనాటి యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా కొనసాగించాలని సీఎం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీకి ప్రత్యామ్నాయంగా కేంద్రం తీసుకొచ్చిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్(గ్రామీణ (వీబీజీరామ్‌జీ)'ను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శుక్రవారం సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. జాతీయ ఉపాధి హామీ పథకంలో నుంచి గాంధీ పేరును తొలగించడంతో పాటు పలు కీలక మార్పులు చేస్తూ కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం తిరస్కరిస్తోందని స్పష్టం చేస్తూ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఈ తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టారు. ఉపాధి హామీ చట్టంపై, దానిలోని సాధకబాధకాలపై ఈ సభలో విస్తృతంగా చర్చ జరిగింది. తీర్మానంపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టానికి తెలంగాణ రాష్ట్రం వ్యతిరేకమని స్పష్టంగా తెలియజేయాలన్న ఉద్దేశంతోనే ఈ తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి పేద కూలీకి సంవత్సరానికి వంద రోజుల ఉపాధి కల్పించడమే ఈ పథక ప్రధాన లక్ష్యమని తెలిపారు. గత 20 ఏళ్లుగా ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన వారిలో 90 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉన్నారని వెల్లడించారు.

# ఆంజనేయుని దయతోనే నాకు పునర్జన్మ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్





**కొండగట్టు జనవరి 3 ( ప్రజా మంటలు) :** ఆంజనేయుని దయతోనే తనకు పునర్జన్మ లభించిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు.కొండగట్టు కు ఎపి డిప్యుటీ సిఎం పవన్ కళ్యాణ్ పర్యటన కు విచ్చేశారు.ఈ సందర్భంగా కొండగట్టులో వాయుపుత్ర సదన్ ధర్మశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.35.19 కోట్లతో దీక్ష విరమణ మండపం మరియు 96 గదుల వసతి సముదాయానికి టిటిడి నిధులు వెచ్చించనున్నారు.శనివారం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయ స్వామిని ఏపి డిప్యుటీ సిఎం పవన్ కళ్యాణ్ దర్శించుకున్నారు. వీరితో పాటు టిటిడి బోర్డు చైర్మన్ బి.ఆర్ నాయుడు మరియు టి టి డి సభ్యులు పాల్గొన్నారు.మొదట హెలికాప్టర్ ద్వారా జేఎన్టీయూ కు చేరుకున్న పవన్ కళ్యాణ్ కు రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ వయోవృద్దులు, వికలాంగులు మరియు ట్రాన్స్ జెండర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎండోమెంట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మరియు స్థానిక ప్రజా ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న పవన్ కళ్యాణ్ టిటిడి సహకారంతో రూ 35.19 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 35.19 కోట్లతో దీక్ష విరమణ మండపం మరియు 96 గదుల వసతి సముదాయానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏపి డిప్యుటీ సిఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఆంజనేయ స్వామి తమ ఇంటి ఇలవేల్పు అని ఆయన దయతోనే తనకు పునర్జన్మ లభించిందని జనసేన అధినేత ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు.గతంలో ఆలయ అధికారులు తన దృష్టికి తీసుకు వచ్చిన వెంటనే అభివృద్ధి పనులకు మాట ఇచ్చినట్లు తెలిపారు.కొండగట్టు ఆంజనేయ స్వామి దయతో రెండు తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రభుత్వం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ మాస్టర్ ప్లాన్ అమలుకు శ్రీకారం చుట్టడం హర్షనీయం అన్నారు.కొండగట్టు గిరి ప్రదక్షణకు మార్గం సుగమం చేసేందుకు అవసరమైతే తానే స్వయంగా కర సేవకుడిని అవుతానని మాట ఇచ్చారు.భవిష్యత్తులో సైతం ఆలయ అభివృద్ధికి తాను అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.కొండగట్టు ఆంజనేయ స్వామికి నిధులు కేటాయించినందుకు ఏపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కు మరియు టిటిడి కి నా ధన్యవాదాలు అని అన్నారు. కొండగట్టు అంజన్న స్వామి అజ్ఞ వల్లే ...అందుకే టిటిడి వారు అమోదం లభించిందని తెలిపారు. కొండగట్టు అభివృద్ధి కి తెలంగాణ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రూపొందించడం అభినందనియం అని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఘనంగా స్వాగతం తెలిపిన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గిరిప్రదిక్షణ తెలుగు రాష్ట్రాలకి, దేశానికి కూడ రక్ష అని అన్నారు. కొండగట్టు గిరి ప్రదిక్షణ కి అందరం కలిసి కరసేవా చేద్దాం అని తెలిపారు. అలాగే కొండగట్టు ఆలయ అభివృద్ధికి అందరు కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు మరియు తన అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ పుణ్యక్షేత్రాల్లో ప్రధానమైన కొండగట్టు ఆంజనేయ స్వామి అలయంకు ఏపి ఉప ముఖ్యమంత్రి వచ్చి 35.19 కోట్లతో దీక్ష విరమణ మండపం మరియు 96 గదుల వసతి సముదాయానికి టిటిడి నిధులు అందివ్వడం కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తులో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ద్వారా నిధులు కేటాయించి కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం తిరుమల తిరుపతి దేవస్థానం లాగా అభివృద్ధి చేస్తామని పునరుద్ఘటించారు. టిటిడి నిధులు సమకూర్చడానికి తోడ్పడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం మాట్లాడుతూ కొండగట్టు ఆంజనేయ స్వామి అలయంకు ఏపి డిప్యూటీ సిఎం సహకారంతో 35.19 కోట్లతో దీక్ష విరమణ మండపం మరియు 96 గదుల వసతి సముదాయానికి టిటిడి నిధులు అందివ్వడం కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీ శాసన మండలి విప్ పిడుగు హరిప్రసాద్, టీటీడీ బోర్డు మెంబర్లు బి.ఆనందసాయి, బి.మహేందర్ రెడ్డి, టీటీడీ ఎల్.ఎ.సీ. చైర్మన్ ఎన్ శంకర్ గౌడ్, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజా గౌడ్ , జిల్లా అధికారులు, ఆలయ ఈ.వో, ఇతర అధికారులు, ఆలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని కాపాడే అధికారి లేడా ? అంటూ దళితుల ఆవేదన

**ప్రభుత్వ కెనాల్ భూమి ఆక్రమణపై దళితుల ఆగ్రహం**

**అధికారుల నిర్లక్ష్యంపై మండలంలో తీవ్ర అసంతృప్తి**

**మండల తహసిల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదు..?**

**ఎస్సారెస్పీ అధికారులు పర్యవేక్షణ చేయడం లేదు..?**





**ఎల్కతుర్తి జనవరి 03 ప్రజా మంటలు :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లి , దగ్గువారి పల్లె మధ్యలో ఉన్న టిబిఎం20 పరిధిలోని ప్రభుత్వ కెనాల్ భూమిని అక్రమంగా ఆక్రమించుకొని, దళితులకు చెందిన పొలాలకు వెళ్లే మార్గాన్ని మూసివేశారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ భూమి సమీపంలో జెసిపితో కాల్వ తవ్వుతుండగా ఎందుకు తవ్వుతున్నారని సూరారం గ్రామానికి చెందిన బచ్చు శ్రీనివాస్ రావు తండ్రి రామారావు తల్లి, అక్కడికి చేరుకొని జెసిపిని నిలిపివేశారని తెలిపారు.ఈ విషయంపై ఇప్పటికే 2023 లో గ్రీవెన్స్ సెల్ ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. అలాగే గత నెల 17,12,2025 వ తేదీన మండల తహసిల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని వాపోతున్నారు.దళిత సామాజిక వర్గానికి చెందిన రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా, ఏ అధికారికి మొరపెట్టుకున్నా చర్యలు తీసుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తహసిల్దార్ జోక్యం చేసుకొని అక్రమ ఆక్రమణలపై చర్యలు తీసుకుని, ప్రభుత్వ భూమిని కాపాడి దళితుల పొలాలకు దారి కల్పించాలని డిమాండ్ చేశారు.అలాగే ఎస్సారెస్పీ అధికారులు పర్యవేక్షణ చేయడం లేదని, హైడ్రా చర్యలు పట్టణ ప్రాంతాలకు మాత్రమేనా? గ్రామాలకు వర్తించవా? ప్రభుత్వ భూమిని కాపాడే అధికారి లేడా? అంటూ దళితులు ప్రశ్నిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జూపాక ఎల్లయ్య, కామెర గాలిబు, కామెర దీపక్, జాజాల మొగిలి, గొల్లెన లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# బోధి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సావిత్రి పూలే బాయ్ జన్మదిన

**వేడుకల్లో పాల్గొన్న,అడిషనల్ కలెక్టర్ బిఎస్, లత**



**గొల్లపల్లి డిసెంబర్ 03 ప్రజా మంటలు :** విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అడిషనల్ జిల్లా కలెక్టర్ బిఎస్ లత అన్నారు.బోధి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం గొల్లపల్లి మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే 195వ జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత ,ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మహిళా ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. ప్రతి విద్యార్థికి ఉపాధ్యాయులే రోల్ మోడల్ అని పేర్కొన్నారు. భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలని, మహిళల కోసం తొలి పాఠశాలను స్థాపించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని, వారి జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణ మన్నారు సావిత్రిబాయి పూలే స్థాపించిన తొలి పాఠశాల వల్లనే నేడు మహిళలు విద్యావంతులై వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకున్నారని పేర్కొన్నారు. యువతలో వ్యసనాలను రూపు మాపేందుకుఉపాధ్యాయులు సమాజానికి దిశానిర్దేశం చేయాలనిపిలుపునిచ్చారు బోధి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు బొల్లె రాజన్న మాట్లాడుతూ,మూఢనమ్మకాలు, దురాచారాలు రాజ్యమేలు తున్న కాలంలో ఎన్నో అవమానాలు, కష్టాలను ఎదుర్కొని సమాజ మార్పు కోసం సావిత్రిబాయి పూలే, జ్యోతిబా పూలే కృషి చేశారని అన్నారు. వారి అహర్నిశల సేవల ఫలితంగానే నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించారని పేర్కొన్నారు. సమాజాన్ని మార్చిన గొప్ప వనిత సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. పిల్లలకు కాలానుగుణంగా మంచిచెడును బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని, మహిళల పట్ల సమాజంలో ఆలోచన ధోరణి మారాలని, సావిత్రిబాయి పూలే ఆశయాలను నెరవేర్చాలని కోరారు.ఈ సందర్భంగా గొల్లపెల్లి మండల మహిళ సర్పంచ్ ఉప సర్పంచులకు బోధి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సన్మానించారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అబ్దుల్ మహ్మద్ మజీద్, ఎంపీడీవో రవీందర్ రావు , వ్యవసాయ అధికారి కర్ణ , కేజీబీవీ ప్రిన్సిపల్ పద్మ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఏనుగుల మల్లయ్య, బోధి స్వచ్ఛంద సంస్థ సభ్యులు బొమ్మన కుమార్, అంకం భూమయ్య, చౌటపల్లి తిరుపతి, ఉప్పులేటి నరేష్, గోవర్ధన్, అభిషేక్ రెడ్డి,ఉపాధ్యాయులు, సర్పంచులు ఉపసర్పంచులు మహిళలు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు స్ఫూర్తి సావిత్రిబాయి పూలే జీవితం




**సికింద్రాబాద్, జనవరి 03 ( ప్రజామంటలు) :** మహిళా విద్యకు మార్గదర్శకురాలిగా నిలిచిన సావిత్రిబాయి పూలే 195వ జయంతిని పురస్కరించుకొని సికింద్రాబాద్‌లో ఓబీసీ మోర్చా రజక సెల్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమ ంలో మహిళా ఉపాధ్యాయురాలు కృష్ణప్రియ ముఖ్య అతిథిగా పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కృష్ణప్రియ మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే జీవితం యావత్ మహిళా లోకానికి ఆదర్శమని అన్నారు. అక్షరజ్ఞానం లేని స్థితి నుంచి భర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో విద్యాభ్యాసం చేసి భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు.కుల వివక్ష, బాల్య వివాహాలు, సతి సహగమనం వంటి దురాచారాల నిర్మూలన కోసం సావిత్రిబాయి పూలే చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని తెలిపారు. మహిళలపై జరుగుతున్న వివక్షకు విద్యే శాశ్వత పరిష్కారమని నమ్మి, పూణేలో స్వంత ఖర్చులతో 50కిపైగా పాఠశాలలు స్థాపించి మహిళలకు విద్య అందించారని గుర్తు చేశారు.స్త్రీపురుష సమానత్వం, అన్ని కులాల మధ్య సమాన హక్కుల కోసం ఆమె చేసిన కృషి భారతీయ స్త్రీవాద చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి మొక్కలను అందచేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, ధనసౌజన్య, శ్రీజ, పార్వతి, జ్యోతి, వాణి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి తెలంగాణ ఎస్ జి ఎఫ్ యు-14 వాలీబాల్ టీమ్ కు మేనేజర్ గా బైకనీ కొమురయ్య



**గొల్లపల్లి (ధర్మారం) డిసెంబర్ 3 ప్రజా మంటలు :** హిమాచల్ ప్రదేశ్ లోని పాంటా సాహిబ్ లోఈ నెల 5 నుండి 9 వరకు జరిగే 69వ పాఠశాలల క్రీడా సమాఖ్య జాతీయ స్థాయి అండర్ 14 సం. బాలుర వాలీబాల్ జట్టు అసిస్టెంట్ కోచ్ గా(మేనేజర్ గా)ధర్మారం ఆదర్శ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బైకనీ కొమురయ్య ఎంపిక కాగా తెలంగాణ స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఉషారాణి, పెద్దపల్లి జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ కే .లక్ష్మన్, తెలిపారు. ఈ సందర్భంగా కొమురయ్య ఎంపిక పట్ల ధర్మారం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్ కుమార్ పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకగా అభినందించారు.

# వల్భాపూర్ గ్రామంలో మహిళలను ప్రోత్సహించే ఉద్దేశంతో ముగ్గుల పోటీలు

**విజేతలకు బహుమతులు అందించిన గ్రామ సర్పంచ్ పొనగంటి శ్వేత**



**ఎల్కతుర్తి జనవరి 03 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండలంలోని వల్భాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ పొనగంటి శ్వేత, ఉపసర్పంచ్ అంబాల అనిల్ ఆధ్వర్యంలో మహిళలను ప్రోత్సహించే ఉద్దేశంతో ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వ హించారు.ఈ కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు ఉత్సాహంగా పాల్గొని తమ కళాత్మక ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి సర్పంచ్ పొనగంటి శ్వేత చేతుల మీదుగా బహు మతులు అందజేశారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో గ్రామంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ ఐక్యత, సంప్రదాయాలకు ప్రాధాన్యతనిచ్చే కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగించాలని గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి ఎస్ నవీన్ రెడ్డి, పొనగంటి రత్నాకర్ రావు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## జిలుగుల గ్రామంలో మహిళ సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**ప్రథమ బహుమతి, వరలక్ష్మి గ్రామక్య సంఘానికి చెందిన పెద్ది రజిని శ్రీరామోజు జ్యోతి**



**ఎల్కతుర్తి జనవరి 03 ప్రజా మంటలు :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం జిలుగుల గ్రామంలో తొలి మహిళా గ్రామ సర్పంచ్ ఘనబోయిన సృజన ఉప సర్పంచ్ పెద్ది శ్రీపాల్ రెడ్డి అధ్యక్షతన శనివారం జిలుగుల గ్రామపంచాయతీ ఆవరణంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో వరలక్ష్మి గ్రామక్య సంఘం అధ్యక్షురాలు ఎం. మంజుల, వివో ఏ. రావుల స్వరూప, మరియు మహాలక్ష్మి గ్రామక్య సంఘం అధ్యక్షురాలు కె. విమల, వివో ఏ. టి. స్వప్న మహిళ సంగం సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంత చేశారు. గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో ఆసక్తిగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీ హెచ్ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ నరహరి రవీందర్ రెడ్డి పిఎస్ హెచ్ఎం జి. సునంద, కె. స్వప్న హాజరై మహిళలను ప్రోత్సహించారు. మహిళలంటేనే అన్ని రంగాల్లో ముందుంటారని ఈ సందర్భంగా తెలిపారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి గెలుపొందిన వరలక్ష్మి గ్రామక్య సంఘానికి చెందిన పెద్ది రజిని, శ్రీరామోజు జ్యోతి, ద్వితీయ బహుమతి గెలుపొందిన మహాలక్ష్మి గ్రామైక్య సంఘానికి చెందిన మిరియాల నిర్మల, ఆరెపల్లి రమ్య సమైక్య సంఘాల సభ్యురాళ్లకు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కారోబార్ ఎండి హైమద్ పాషా,గ్రామ మహిళలు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే 195 వ జయంతి వేడుకలు

**మహిళ ఉపాధ్యాయులను సత్కరించిన జిలుగుల జెడ్పీ హెచ్ఎస్ పాఠశాల ప్రిన్సిపల్**

**జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రిన్సిపల్ నరహరి రవీందర్ రెడ్డి**





**ఎల్కతుర్తి జనవరి 03 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని జిలుగుల గ్రామంలో జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో ఘనంగా సావిత్రి పూలే 195వ జయంతి పాఠశాల ప్రిన్సిపాల్ నరహరి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో తొలి మహిళ ఉపాధ్యాయురాలు సామాజిక విప్లవకారిని, స్త్రీ విద్యకు మార్గదర్శకురాలు అయిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే ఒక వ్యక్తి మాత్రమే కాదు ఆమె ఒక ఉద్యమమని మహిళలకు విద్య అవసరం లేదన్న అంధ విశ్వాసాలు ప్రబలంగా ఉన్న కాలంలో ఎన్నో అవమానాలు, అవరోధాలు, ఎదుర్కొంటూ ఆమె ధైర్యంగా ముందుకు సాగిందని కీర్తించారు. విద్య ఆయుధమని నమ్మి బాలికల కోసం పాఠశాలలు ప్రారంభించి సమాజంలో సమానత్వానికి బలమైన పునాది వేశారని కొనియాడారు. విద్య లేకుండా విముక్తి లేదు అన్న సందేశాన్ని తన జీవితముతోనే నిరూపించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని ఆమె చూపిన మార్గంలో నడవడం ద్వారా ప్రతి బాలికకు విద్యా ప్రతి మహిళకు గౌరవం ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు కల్పించడమే అని అన్నారు. సావిత్రిబాయి జయంతి సందర్భంగా కె. స్వప్న, పి. హేమాలత, బి. సమత, మహిళ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించిన జిలుగుల జెడ్పీ హెచ్ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ పాఠశాల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ పటేల్ గోపాల్ రెడ్డి మృతి రాష్ట్ర వైద్య రంగానికి తీరని లోటు: దశదినకర్మలో రాజేశం గౌడ్ నివాళులు



**హైదరాబాద్, జనవరి 03 (ప్రజా మంటలు) :** డాక్టర్ పటేల్ గోపాల్ రెడ్డి మృతి రాష్ట్ర వైద్య రంగానికి తీరని లోటుగా భావించాల్సిన విషాదకర ఘటన అని మాజీ మంత్రి, తెలంగాణ రాష్ట్ర తొలి ఆర్థిక సంఘం చైర్మన్ జి. రాజేశం గౌడ్ పేర్కొన్నారు.డాక్టర్ గోపాల్ రెడ్డి గత నెల 25 డిసెంబర్ 2025న పరమపదించగా, వారి దశదినకర్మను కుటుంబ సభ్యులు శుక్రవారం (జనవరి 03, 2026) హైదరాబాద్‌లోని జూబ్లీ కన్వెన్షన్ సెంటర్‌లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన జి. రాజేశం గౌడ్ డాక్టర్ గోపాల్ రెడ్డి చిత్రపటానికి పూల నివాళులు అర్పించి, అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1985లో తాను మంత్రిగా పనిచేసిన సమయంలో డాక్టర్ గోపాల్ రెడ్డి జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి ప్రారంభ నియామకంగా బాధ్యతలు స్వీకరించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. తన మంత్రిత్వ కాలంలో జగిత్యాల ప్రాంతానికి వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి మంజూరు కావడంలో డాక్టర్ గోపాల్ రెడ్డి సూచనలు, కృషి కీలక పాత్ర పోషించాయని తెలిపారు.అలాగే, డాక్టర్ గోపాల్ రెడ్డి ఉమ్మడి కరీంనగర్ జిల్లా వైద్యాధికారిగా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో విశేష సేవలు అందించారని రాజేశం గౌడ్ గారు ప్రశంసించారు. ప్రజాసేవ పట్ల ఆయన చూపిన అంకితభావం చిరకాలం గుర్తుండిపోతుందని అన్నారు.

# ఘనంగా ముగ్గుల పోటీలు

**విజేతలకు సర్పంచ్ మాచర్ల కుమారస్వామి చేతుల మీదుగా బహుమతులు**



**భీమదేవరపల్లి, జనవరి 3 (ప్రజా మంటలు) :** భీమదేవరపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ముగ్గుల పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. ఈ పోటీల్లో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన మహిళలకు ప్రత్యేక బహుమతులు అందజేయగా, పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి పోటీలో మహిళలను అభినందించారు. మహిళల సృజనాత్మకత, సంప్రదాయ కళల పరిరక్షణలో ముగ్గుల ప్రాధాన్యతను ఆయన కొనియాడారు. గ్రామీణ సంస్కృతికి ఇలాంటి కార్యక్రమాలు దోహద పడతాయని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో వీరేశం హాజరై, మహిళల పాల్గొనడం అభినందనీయం అని అన్నారు. అలాగే ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రాజేందర్, గ్రామ సెక్రటరీ రాజు, అశోక్, కవిత, రాణి తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ప్రేమలత, వెంకటేశ్వర్లు, శ్యామ్, విజయ, సంధ్య తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై, రంగురంగుల ముగ్గులతో పండుగ శోభను మరింత పెంచారు.

# ఉప సర్పంచ్ ల మండల అధ్యక్షునిగా రిబ్బన్ సాగర్



**ఇబ్రహీంపట్నం జనవరి 3 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుని గా కోమటి కొండాపూర్ గ్రామానికి చెందిన బి ఆర్ఎస్ నాయకుడు రిబ్బన్ సాగర్ ను ఎన్నుకోవడం జరిగింది. మండలంలోని 17 మంది ఉపసర్పంచ్లు ఉండగా. రిబ్బన్ సాగరకు 13 మంది ఉపసర్పంచులు మద్దతు ప్రకటించి కోమటి కొండాపూర్ గ్రామానికి చెందిన రిబ్బన్ సాగర్ ను మండల అధ్యక్షునిగా ఎన్నుకోవడం జరిగింది.1) ఎద్దండి తిడ్డు రాంరెడ్డి. 2)మూల రాంపూర్ పందిరి నర్సయ్య.3) వేముల కుర్తి బర్ల మల్లయ్య.4) కొత్తూరు యాట శ్రీలత.5) కేశపూర్ బజాజ్జోళ్ల శ్రీధర్ 6)ఇబ్రహీంపట్నం నాంపల్లి రమేష్. 7)అమ్మక పేట మరుపాక సురేష్.8) డబ్బా రాంపల్లి మహేష్.9) ఎర్రపూర్ మాలత్ వసంతరావు.10)యామాపూర్ దామెర లావణ్య.11)పక్కిరి కొండాపూర్ గుండేటి పుష్ప.12)భర్తీ పూర్ భీంకర్ అఖిల్13). తిమ్మాపూర్ ముక్కెర సతీష్.రిబ్బన్ సాగర్ కు మద్దతు ఇవ్వడం జరిగింది.

# సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఉపాధ్యాయులకు సన్మానం



**సికింద్రాబాద్, జనవరి 03 ( ప్రజామంటలు) :** సావిత్రిబాయి పూలే 195వ జయంతిని పురస్కరించుకొని బన్సీలాల్‌పేట కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. సనత్‌నగర్ నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ కోట నీలిమ ఆదేశాల మేరకు కవాడిగూడలోని ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్ ప్రిన్సిపల్ స్వర్ణలత, మోండా మార్కెట్‌లోని ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపల్ నాగజ్యోతి, గుండు ఈశ్వరయ్య హైస్కూల్ ఉపాధ్యాయురాళ్లను శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా విద్యార్థివిద్యార్థినులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు వీఎస్ నారాయణ, డి.శ్రీనివాస్, శివలాల్, పాండు గౌడ్, రాజేందర్, సీపీ శంకర్, అనిత, భాగ్యమ్మ, కలీం, మహేశ్, హరి, సునీల్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# వంగర గురుకులానికి 70 వేల ఫర్నీచర్ విరాళం

**వంగర గురుకుల అభివృద్ధికి పి.వి. ప్రభాకర్ రావు చేయూత**



**భీమదేవరపల్లి, జనవరి 3 (ప్రజా మంటలు) :** భారతరత్న, దివంగత మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు స్వస్థలమైన వంగర గ్రామంలోని డా. పి.వి. రంగారావు బాలికల గురుకుల పాఠశాల/కళాశాల సైన్స్ ల్యాబ్‌ల కోసం పి.వి. గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ పి.వి. ప్రభాకర్ రావు రూ.70 వేల విలువైన ఫర్నీచర్‌ను అందజేశారు. ల్యాబ్ ఫర్నీచర్ లేమిని ప్రిన్సిపాల్ సుల్తానా తెలియజేయడంతో వెంటనే స్పందించిన ప్రభాకర్ రావు హామీ మేరకు ఫర్నీచర్ అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామ మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, ప్రస్తుత సర్పంచ్ స్రుజన రమేశ్, ఉపసర్పంచ్ రమేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటరెడ్డి, బుచ్చిరెడ్డి, సతీష్, అశోక్, తిరుపతి రెడ్డి, లక్ష్మీకాంతరావు, చంద్రారెడ్డి, సతీష్ రెడ్డి తదితరులు హాజరై పి.వి. ప్రభాకర్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## డా. సుభాషిణి అడ్వకేట్ సేవలు అభినందనీయం



**సికింద్రాబాద్, జనవరి 03 (ప్రజా మంటలు) :** బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణలో మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు సుప్రీంకోర్టులో ఇంటర్వెన్ పిటిషన్ దాఖలు చేసి, 64 ఏళ్లుగా మహిళలకు అందని హక్కును సాధించిన ఘనత డాక్టర్ సుభాషిణి అడ్వకేట్ కే దక్కుతుందని జాతీయ యువజన అవార్డు గ్రహీతలు డా. దేశబోయిని నర్సింహులు, కానుగంటి మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం డా. సుభాషిణిని శాలువాతో సన్మానించారు. న్యాయవాదిగా అనేక మందికి న్యాయం అందేలా ఆమె చేసిన సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. గతంలో భారత ప్రభుత్వం డాక్టర్ సుభాషిని సేవలను గుర్తించి జాతీయ యువజన అవార్డును అందజేసింది అన్నారు. రానున్న బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఎన్నికల్లో సభ్యురాలిగా పోటీ చేస్తున్న డా. సుభాషిణిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని న్యాయవాదులను కోరారు.

## విజ్ఞాన్ విద్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

### పాఠశాల వ్యవస్థాపకులు నాడిపెల్లి ప్రభాకర్ రావు





**ఎల్కతుర్తి జనవరి 03 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలోని విజ్ఞాన్ విద్యాలయంలో భారత దేశపు తొలి మహిళ ఉపాధ్యాయురాలు స్త్రీ విద్యా పితామహి సావిత్రిబాయి పూలే 195వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పలు కార్యక్రమాలు చేపట్టారు సావిత్రిబాయి పూలే మహిళల విద్యాభివృద్ధికి సామాజిక సమానత్వానికి చేసిన సేవలను ఈ సందర్భంగా వ్యక్తం కొనియాడారు. నేటి నూతన యుగములో ఆడపిల్లలు విద్యాలో ముందుకు వెళ్లి సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యజమాన్యం నాడిపెల్లి ప్రభాకర్ రావు, సుధీర్ రావు, షహనాజ్ రాసి, శ్వేత, అసిఫా, తదితరులు పాల్గొన్నారు. విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సావిత్రిబాయి పూలేకు ఘన నివాళులు



**సికింద్రాబాద్, జనవరి 03 ( ప్రజా మంటలు) :** సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా సమాజంలో అసమానతలపై అలుపెరుగని పోరాటం చేసిన భారతదేశ తొలి మహిళా విద్యావేత్త సావిత్రిబాయి పూలేకు ఆల్ ఇండియా ముదిరాజ్ సమాజ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పొట్లకాయల వెంకటేశ్వర్లు ఘన నివాళులు అర్పించారు. మహిళల హక్కులు, విద్య కోసం ఆమె చేసిన కృషి వల్లే నేడు భారతదేశంలో మహిళలు రాష్ట్రపతి, కేంద్ర మంత్రులు, కలెక్టర్లు, ఐఏఎస్ అధికారులుగా7 ఎదుగుతున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. మహిళా విద్యకు పునాది వేసిన సావిత్రిబాయి పూలే సేవలను స్మరించుకుంటూ ఆమెకు నివాళులు అర్పించారు.

## వంగర ప్రజలకు శుద్ధి నీరు బాల వికాస వాటర్ ప్లాంట్ దిశగా అడుగు

### సర్పంచ్ సృజన రమేష్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ సమావేశం



**భీమదేవరపల్లి, జనవరి 3 (పూజా మంటలు) :** వంగర గ్రామ ప్రజలకు శుద్ధి చేసిన త్రాగునీరు అందించే లక్ష్యంతో బాల వికాస వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ ఆధ్వర్యంలో స్థానిక పి.వి. నరసింహారావు విగ్రహం వద్ద సమావేశం నిర్వహించారు. బాల వికాస ఫెడరేషన్ అధ్యక్షులు చేయడం కేడం లింగమూర్తి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన త్రాగునీటి అవసరం ఎంతో ముఖ్యమని, గ్రామ పంచాయతీ సహకారంతో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ ఓల్లాల రమేష్, వార్డు సభ్యులు గజ్జల రమేష్, రఘునాయకుల మహేష్, శ్రీరామోజు మొండయ్య, మారం సతీష్ పాల్గొన్నారు. అలాగే స్థానికులు సుహాసిని, ఓల్లాల ఇందిర, కొండ తిరుపతి, గిద్ద శ్రీనివాస్, వలి, షేక్ రషీద్ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన బాల వికాస వాటర్ ప్రోగ్రామ్ మేనేజర్ మధుసూదన్ రెడ్డితో పాటు ఫీల్డ్ కోఆర్డినేటర్ కిషన్ లను గ్రామస్తులు అభినందించారు.

## సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయం

### గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి



**భీమదేవరపల్లి, జనవరి 3 (ప్రజా మంటలు) :** భీమదేవరపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ మాచర్ల కుమారస్వామి ఆధ్వర్యంలో భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాచర్ల కుమారస్వామి మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే గారు బాలికల విద్య కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్య ద్వారా మహిళల స్వాభిమానం, స్వావలంబన సాధ్యమని నిరూపించిన మహనీయురాలని కొనియాడారు. వితంతు మహిళలకు ఉపాధి కల్పన కోసం ఆమె చేసిన కృషి సమాజానికి ఆదర్శమని తెలిపారు. అలాగే ఆ కాలంలోనే పిల్లల కోసం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టిన దార్శనికులు పూలే దంపతులని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రాజు, వార్డు సభ్యులు ప్రేమలత, లలిత, అశోక్, శ్యామ్, వెంకటేశ్వర్లు, విజయ, సంధ్యతో పాటు గ్రామ పెద్దలు పాల్గొని పూలే గారికి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమం సామాజిక అవగాహనతో పాటు మహిళా విద్య ప్రాముఖ్యతను చాటిచెప్పిందని పాల్గొన్నవారు తెలిపారు.

## పదవ తరగతి విద్యార్థులకు స్నాక్స్

### టీఆర్టీఎఫ్ హర్షం!



**హైదరాబాద్ జనవరి 3 (ప్రజా మంటలు) :** ప్రభుత్వ, జిల్లా పరిషత్, మోడల్ పాఠశాలలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ సమయంలో స్నాక్స్ అందజేయాలనీ టి ఆర్ టి ఎఫ్ పక్షాన పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ని కలిసి చేసిన ప్రాతినిధ్యం మేరకు వారు సానుకూలంగా స్పందించి విద్యార్థులకు స్నాక్స్ అందిస్తామని పేర్కొన్నారు ఈ నిర్ణయంపై తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టి ఆర్ టి ఎఫ్) హర్షం వ్యక్తం చేసింది. జిల్లా విద్యాశాఖ అధికారులకు త్వరలోనే ఆదేశాలు జారీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి లు తెలిపారు. సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్ ఇవ్వడం ద్వారా ఏకాగ్రతతో చదువుకోగలుగుతారని వారు పేర్కొన్నారు. అదేవిధంగా, ప్రస్తుతం ప్రభుత్వ సర్వీసులో ఉండి టెట్ (టెట్) పరీక్షకు హాజరవుతున్న ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించాలనే డిమాండ్ పై ప్రభుత్వం సానుకూలంగా ఉందని, దీనికి సంబంధించి అధికారిక ఉత్తర్వులు త్వరలో వెలువడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల ప్రయోజనాలను మరియు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తీసుకొనే చర్యల పట్ల టిఆర్టిఎఫ్ కృతజ్ఞతలు తెలిపింది. కటకం రమేష్ (అధ్యక్షుడు) మారెడ్డి అంజి రడ్డి (ప్రధాన కార్యదర్శి) తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టి ఆర్ టి ఎఫ్).

## ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్‌లో డీసీపీ కవిత వార్షిక తనిఖీ

### రికార్డుల పరిశీలన, సిబ్బందికి సూచనలు





**ఎల్కతుర్తి డిసెంబర్ 3 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో వార్షిక (ఆన్యువల్) ఇన్స్పెక్షన్ సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహణ, విధులు, రికార్డుల నిర్వహణపై సమగ్రంగా పరిశీలించారు. ఇన్స్పెక్షన్‌లో భాగంగా కేసుల రిజిస్టర్లు, జనరల్ డైరీ, సీసీటీవీ నిర్వహణ, వాహనాల రికార్డులు, ఆయుధాల భద్రత, మాల్ఖానా, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను డీసీపీ కవిత పరిశీలించారు. రికార్డుల నిర్వహణలో మరింత క్రమబద్ధత పాటించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. అలాగే పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విధుల్లో నిబద్ధతతో పాటు ప్రజల విశ్వాసాన్ని పెంపొందించేలా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ పింగళి ప్రశాంత్ రెడ్డి, సీఐ పులి రమేష్, ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌తో పాటు స్టేషన్‌లోని మొత్తం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. డీసీపీ తనిఖీతో స్టేషన్ పనితీరులో మరింత మెరుగుదల సాధించేందుకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు.

## రాష్ట్ర మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన టీఎన్జీవో నాయకులు



**జగిత్యాల జనవరి 3(ప్రజా మంటలు) :** టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు మిర్యాల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్సి ఎస్టి వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారు. మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ టీఎన్జీవో ఉద్యోగులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉద్యోగుల సమస్యలు ఏమి ఉన్న తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా ప్రభుత్వం తో మాట్లాడి పరిష్కరించే విధంగా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా నాయకులు రవీందర్, రవి కుమార్, రాజేందర్, రాములు, రాజేశం, సుగుణాకర్, ప్రమోద్, శైలజ, శ్రావణి, ఆనంద్, రాజ్ కుమార్, గణేష్, పూర్ణచందర్, రాజేష్, వెంకటరమణ, రవి, ప్రశాంత్, విశాల్, సంతోష్, నరేష్, నాగరాజు, సురేఖ, రమాదేవి, జమున, నాల్గవ తరగతి ఉద్యోగుల అధ్యక్ష కార్యదర్శులు అరుణ, నారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ముల్కనూర్‌లో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

### స్త్రీ విముక్తికి అక్షరమే ఆయుధం వక్తలు



**భీమదేవరపల్లి జనవరి 3 (ప్రజా మంటలు) :** స్త్రీ విద్యకు పునాది వేసిన చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 195 వ జయంతి కార్యక్రమం ముల్కనూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహనీయుల ఉత్సవ కమిటీ చైర్మన్ కొలుగురి రాజు, జేఏసీ భీమదేవరపల్లి మండల చైర్మన్ ద్యాంగల సారయ్య, గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ, ఆధునిక భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పూలే స్త్రీల, నిమ్న వర్గాల విద్యాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాసగోని మమత బాలకృష్ణతో పాటు ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గం మాదిగ మాజీ సర్పంచ్ మాడుగుల కొమురయ్య, ఆదరి రవీందర్, డాక్టర్ ఎద్దులాపురం తిరుపతి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు జక్కుల అనిల్, టీఆర్ఎస్ మండల అధ్యక్షులు మండల సురేందర్, అంబేద్కర్ సంఘ నాయకులు వెల్తురు ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ అరిగేలా అభినవ్ కు అత్యుత్తమ పరిశోధన పత్రం అవార్డు




**జగిత్యాల జనవరి 3 ( ప్రజా మంటలు) :** జగిత్యాల ముద్దుబిడ్డ డాక్టర్ అరిగేలా అభినవ్ కు అత్యుత్తమ పరిశోధన పత్రం అవార్డు లభించింది హైదరాబాదులో నిర్వహించిన 22వ అప్రస్కాన్ 20 25 అసోసియేషన్ ఆఫ్ ప్లాస్టిక్ రీకన్స్ట్రక్టివ్ సర్జన్స్ ఆఫ్ తెలంగాణ అండ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాన్ఫరెన్స్లో జగిత్యాలకు చెందిన డాక్టర్ అభినవ్ సమర్పించిన పరిశోధన పత్రానికి గోల్డ్ మెడల్ మరియు నగదు బహుమతి అత్యుత్తమ పరిశోధన పత్రముగా ఎంపికైంది ఈ సందర్భంగా నిర్వాహకులు అభినవ్ ను అభినందించారు. కాగా అభినవ్ జగిత్యాల ఎస్ కె ఎన్ ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అశోక్ కుమారుడు ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది అధ్యాపకులు అభినవ్ను ప్రొఫెసర్ అశోకుని అభినందించారు

## ఇబ్రహీంపట్నం సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం జనవరి 3(ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** ఇబ్రహీంపట్నం సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా అమ్మక పేట గ్రామా సర్పంచ్ కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు సమావేశం నిర్ణయించి ఫోరం మండల అధ్యక్షులుగా భాస్కర్ రెడ్డిని. ఉపాధ్యక్షులుగా తారి రామానుజన్ (వేముల కుర్తి) లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి చేసే క్రమంలో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో వర్షకొండ పొనుకంటి వెంకటి. తిమ్మాపూర్ బాషా శ్రావణ్. ఎద్దండి కళ్ళెడ గంగాధర్. గోధుర్ బండి రాజేష్. కోమటి కొండాపూర్ కొప్పెల్ల పద్మజ. ఎర్రాపూర్ తోగారి రచన. కోజన్ కొత్తూరు చల్ల రక్షిత. పక్కిర్ కొండాపూర్ తోట రమేష్. యామాపూర్ కనుక నాగేష్. ఫోరం అధ్యక్ష. ఉపద్యక్షులకు మద్దతు ఇవ్వడం జరిగింది.

## చిన్నారుల భవిష్యత్ తీర్చిదిద్దుతున్న అంగన్ వాడీలు

### ప్రముఖ సినీ నటుడు గౌతమ్ రాజు

### స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి




**సికింద్రాబాద్, జనవరి 03 ( ప్రజామంటలు) :** చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న అంగన్ వాడీ టీచర్ల కృషి ఎంతో గొప్పదని ప్రముఖ సినీ నటుడు గౌతమ్ రాజు అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని శనివా రం పద్మారావునగర్ లో స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగన్వాడీ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరిం చారు. స్కై ఫౌండేషన్ కార్యాల యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సీనియర్ నటుడు గౌతమ్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని అంగన్వాడీ ఉపాధ్యాయులను శాలువాలు, మెమంటోలు, ప్రశంసాపత్రాలతో సన్మానించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు డా. వై. సంజీవ్ కుమార్ మాట్లాడుతూఅమ్మ తర్వాత మరో అమ్మగా అంగన్వాడీ ఉపాధ్యాయులు పిల్లల జీవితాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. చిన్నారుల భవిష్యత్తు నిర్మాణంలో వారి సేవలు అమూల్యమన్నారు. వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో అంగన్వాడీ ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివని, సావిత్రిబాయి పూలే ఆశయాలను ఆచరణలోకి తీసుకెళ్తున్న వారి కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.

## తెలుగు వెలుగుల వేడుక 'అనురాగ సంగమం' ప్రారంభం

### మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు సిద్ధమైన గుంటూరు

### నేటి నుంచి మూడు రోజులపాటు నిర్వహణ

### ఐదు ప్రాంగణాల్లో కార్యక్రమాలు



మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు గుంటూరులో ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేడు (శనివారం) ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవ సభ జరగనుంది. అన్నమయ్య కీర్తనల సహస్ర గళార్చన నడుమ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, విశ్వయోగి విశ్వంజీ, ఏపీ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. అదే సమయంలో మహాసభల ప్రాంగణం చుట్టూ ఏర్పాటు చేసిన నాలుగు ఉపవేదికలపై సన్మానాలు, సాహితీ సదస్సులు, కవి సమ్మేళనాలు, తెలుగు చలనచిత్ర గీతాలాపనలు మొదలు కానున్నాయి. ఈ కార్యక్రమాలు రాత్రి 11 గంటల వరకు జరుగుతాయని మహాసభల నిర్వాహకుడు, ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఆధ్యాత్మిక వేదికపై ప్రవచనాలు, హోమాలు, కల్యాణాలు ఉంటాయన్నారు. ప్రధాన వేదిక ముందు ఏర్పాటు చేసిన రామోజీరావు హస్తకళల ప్రాంగణంలో తెలుగు భాష ప్రాచీనత్వాన్ని ప్రస్ఫుటించేలా పురాతన సాహిత్యం, ప్రాచీన నాణేలు, తెలుగు సంప్రదాయ వంటకాలు సందడి చేయనున్నాయి. సాయంత్రం ఏర్పాటు చేసిన ఆంధ్ర శ్రీపూర్ణకుంభ పురస్కారాల సభకు ముఖ్య అతిథిగా ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు హాజరు కానున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్.మానవేంద్రనాథ్‌రాయ్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, విశ్వహిందూ పరిషత్తు సభ్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొననున్నారు. ఈ సభలకు తెలుగువారి 'అనురాగ సంగమం'గా నామకరణం చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. మొత్తం 20 ఎకరాల విస్తీర్ణంలో ఈ సభలు జరగనున్నాయి. అయితే ప్రధానంగా 10 ఎకరాల్లో పార్కింగ్, మరో 10 ఎకరాల్లో వేదికలు ఏర్పాటవుతున్నాయి. దాదాపు 5,000 మంది కూర్చునేలా నందమూరి తారకరామారావు పేరుతో ప్రధాన వేదికను నిర్మిస్తున్నారు. కవి సమ్మేళనాలకు జాషువా, కరుణశ్రీ వేదిక, అవధానాల ప్రదర్శనల కోసం కొప్పరపు కవుల వేదిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తూము నరసింహదాసు వేదిక, పాడనా తెలుగు పాట కోసం ఘంటసాల, ఎస్.పి.బాలు వేదికలు ఏర్పాటు చేస్తున్నారు. 4వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సభలకు మారిషస్ దేశాధ్యక్షుడు ధరమ్‌బీర్ గోకుల్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. శనివారం రాత్రికే ఆయన గుంటూరు చేరుకోనున్నారు. ఉత్తరాఖండ్ జ్యోతిష్మఠ్ జగద్గురు ఆదిశంకరాచార్య పీఠం ఉత్తరాధికారి స్వామి ప్రత్యక్ చైతన్య ముకుందానందగిరి శంకరాచార్య మహరాజ్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, శాసనమండలి ఛైర్మన్ పి.మోషేనురాజు, మంత్రులు పాల్గొంటారు. సాయంత్రం జరిగే కార్యక్రమాలకు త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి హాజరవుతారు. ఈ సందర్భంగా ఆంధ్ర సారస్వత సేవా పురస్కారాల ప్రదానం జరగనుంది. మహాసభల చివరి రోజైన సోమవారం ఉదయం కార్యక్రమాలకు సీఎం చంద్రబాబు, గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు, పలువురు మంత్రులు హాజరవుతారు. మూడో ప్రపంచ తెలుగు మహాసభల పోస్టల్ కవర్‌ను సీఎం ఆవిష్కరించనున్నారు. మధ్యాహ్నం సభలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు 'మన తెలుగు భాష – అమృత భాష' అంశంపై ప్రసంగించనున్నారు. సాయంత్రం జరిగే ముగింపు సభకు సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, మంత్రి లోకేశ్ హాజరుకానున్నాట్లు సమాచారం. మూడు రోజుల కార్యక్రమంలో అనేక తెలుగు సాహిత్య ప్రక్రియలు అలరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అష్టావధానాలు, తెలుగు గజల్ సదస్సులు, భక్తి సాహిత్యం, చలనచిత్ర సాహిత్యంపై ప్రసంగాలు, ఇష్టాగోష్ఠులు, గీతాలాపనలు, వివిధ రకాల పురస్కారాల ప్రదానం చేపట్టనున్నట్లు వివరించారు. తెలుగు సంప్రదాయ వంటకాలతో విందు ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సంబంధిత అధికారులు తెలుపుకున్నారు.

## టికెట్ బుకింగ్ టైంలో ఆ ఆప్షన్‌ను క్లిక్ చేయండి

### పైసా ఖర్చులేకుండా పై తరగతిలో ప్రయాణించండి

### రైల్లో దూర ప్రాంత ప్రయాణానికి ఐఆర్‌సీటీసీలో గానీ, రైల్ వన్ యాప్‌లో గానీ టికెట్ బుక్ చేస్తుంటారా?

### ఈ ఆటో అప్‌గ్రేడేషన్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే

### పైసా ఖర్చులేకుండా ప్రయాణించేందుకు అవకాశం



రైలు ప్రయాణం చేస్తున్నారా? చాలా మంది వారి ప్రయాణానికి ముందుగానే టికెట్స్ రిజర్వేషన్ చేసుకుంటుంటారు. కానీ రిజర్వేషన్ విషయంలో ఈ సదుపాయం ఉందన్న విషయం తెలియకపోవడంతో ఎంపిక చేయకుండానే వదిలేస్తూ ఆ అవకాశాన్ని కోల్పోతున్నారు. మరి అదేంటో ఇప్పుడు చూద్దాం. రైల్లో దూర ప్రాంత ప్రయాణానికి ఐఆర్‌సీటీసీలో గానీ, రైల్ వన్ యాప్‌లో గానీ సెకండ్ స్లీపర్ బెర్తు రిజర్వు చేసుకుంటున్న సమయంలో మీకు చాలా ఆప్షన్లు కనిపిస్తాయి. అందులోనే ఒకటి 'ఆటో అప్‌గ్రేడేషన్'. మీరు సెకండ్ స్లీపర్ బెర్తు రిజర్వు చేసుకునే సమయంలో ఈ ఆప్షన్‌ను క్లిక్ చేస్తే ట్రైన్ బయల్దేరేటప్పుడు ఖాళీ బెర్తులుంటే రూపాయి ఖర్చు లేకుండా థర్డ్ ఏసీ క్లాస్‌లో ప్రయాణించే అవకాశం ఆటోమేటిగ్గా లభిస్తుంది. ఈ మేరకు మీకు మెసేజ్ వస్తుంది. అంతేకాదు సెకండ్ ఏసీ బుక్ చేసుకున్న వారికి ఖాళీల అనుగుణంగా ఫస్ట్ ఏసీ తరగతిలో ప్రయాణించే అవకాశం రావొచ్చు. సెకండ్ సిట్టింగ్ నుంచి ఏసీ ఛైర్‌కార్‌లో ప్రయాణించే అవకాశం కోసం ఈ ఆప్షన్ క్లిక్ చేస్తే వారికి లభిస్తుంది. ఇంత మంచి బంపర్ ఆఫర్ ఉన్నప్పుడు రిజర్వేషన్ చేసుకొనేటప్పుడు దీన్ని ఎంచుకోవడవం మరవకండి. ఇటీవల ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో రిజర్వేషన్ టికెట్లు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే వీలుండగా, అన్ రిజర్వుడ్, ప్లాట్ ఫారమ్ టికెట్లు బుక్ చేసుకునేలా దక్షిణ మధ్య రైల్వే 'యూటీఎస్' యాప్‌ను ప్రవేశపెట్టింది. స్టేషన్‌కు వచ్చి వరుసలో నిల్చునే అవసరం లేకుండా ఆన్‌లైన్‌లో టికెట్లను బుక్ చేసుకోవచ్చు. ఈ టిక్కెట్లను బుక్ చేసుకోవాలంటే ప్లేస్టోర్ నుంచి యూటీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత ఆధార్, సెల్ నంబర్లను నమోదు చేయాలి. ఈ యాప్‌లో లాగిన్ అయిన తర్వాత స్క్రీన్‌పై కనిపించే నార్మల్ బుకింగ్ సెక్షన్‌లోకి వెళ్లాలి. అందులో కనిపించే బుక్ అండ్ ట్రావెల్, బుక్ అండ్ ప్రింట్ (పేపర్) రెండింటిలో ఏదో ఒక్క ఆప్షన్‌ను ఎంచుకోవాలి. పేపర్ లెస్ ఎంచుకుంటే సెల్‌ఫోన్‌లో జీపీఎస్ ఆన్ చేయాలి. ఆ తర్వాత ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ప్రయాణించాలనుకుంటున్నారో స్టేషన్లను ఎంపిక చేసుకోవాలి. కింద కనిపించే ఎంపికల ద్వారా అందుబాటులో ఉన్న రైళ్లు, వాటి ఛార్జీలు ప్రత్యక్షం అవుతాయి. గెట్ ఫేర్‌పై క్లిక్ చేసి అందుబాటులో ఉన్న రైలుపై క్లిక్ చేయగానే సమయం, ప్లాట్‌ఫామ్ నంబర్, రైలు నంబర్, టికెట్ ధర వివరాలు కనిపిస్తాయి. ప్రయాణికుల రైళ్ల సంఖ్య, టైప్ (ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్) పేమెంట్ టైప్ ఎంచుకోవాలి. కింద బుక్ టికెట్ ఎంపికపై క్లిక్ చేస్తే నగదు చెల్లింపుల కోసం ఏ పద్ధతిలో (ఆర్ వ్యాలెట్, యూపీఐ, క్రెడిట్ కార్డ్) చేస్తారో ఎంచుకొని టికెట్ బుక్ చేసుకోవచ్చు. టికెట్ బుక్ చేసే ముందు పేపర్ మోడ్ ఎంచుకుంటే దగ్గర్లోని యూటీఎస్ కియోస్క్, రైల్వే బుకింగ్ కౌంటర్‌కు వెళ్లి ప్రింట్ తీసుకోవాలి. ఆర్ వ్యాలెట్ టాప్ అప్ చేయడం తప్పనిసరి ఏం కాదు. ఒకవేళ చేస్తే వాలెట్ టాప్ అప్‌పై 3 శాతం బోనస్ వస్తుంది. రైలు ఎక్కాక టికెట్ బుక్ చేయడం వీలు ఉండదు. రైల్ వన్ యాప్‌లో టికెట్ల కొనుగోలుపై రైల్వే శాఖ ఆఫర్ ప్రకటించింది. దీని ద్వారా అన్ రిజర్వుడు టికెట్లను ఏ డిజిటల్ పేమెంట్ మోడల్‌లో కొనుగోలు చేసినా 3 శాతం డిస్కౌంట్ అందించనున్నట్లు వెల్లడించింది. 2026 జనవరి 14 నుంచి జులై 14 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం రైల్ వన్ యాప్‌లో ఆర్–వాలెట్ ద్వారా చెల్లింపులు చేసిన వారికి ఈ క్యాష్‌బ్యాక్ లభిస్తోంది. దీన్ని అన్ని డిజిటల్ పేమెంట్లకూ విస్తరించారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com